సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 21 । నవంబర్ । 2023



ఓటు పడిందా.. లేదా ?

ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల బదులు ఈవీఎంలు వచ్చాయి. ఓటు సరిగా పడిందా లేదా అని వీవీ ప్యాట్ల ద్వారా తెలుసుకోవచ్చు.

2లో



పోలీసులకు నో ఎంట్రీ

ఎన్నికల అధికారి పిలిస్తే తప్ప పోలీసులకు పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఉండదని ఈసీ స్పష్టం చేసింది.

2లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారు జామున, రాత్రికి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించటం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక సోమవారం కావడంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

పెద్దమ్మతల్లికి పూజలు

పాల్వంచ: మండలంలో కొలువుదీరిన పెద్దమ్మతల్లి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కవితా సంకలనం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు


అశ్వారావుపేటరూరల్: ఓటు చైతన్యంపై స్థానిక కవి, రచయిత డాక్టర్ సిద్దాంతపు ప్రభాకరాచార్యులు సంపాదకత్వంలో విద్యార్థులు రాసిన కవితా సంకలనం పుస్తకాన్ని సోమవారం ఎన్నికల పరిశీలకులు, ఐఏఎస్ అధికారి గణేష్, రిటర్నింగ్ అధికారి పి.రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్లను చైతన్య పరిచేలా విద్యార్థులతో కవిత్వాలు రాయించడం, 'మరకా మంచిదే' పేరుతో పుస్తక రూపంలోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ప్రభాకరాచార్యులు మాట్లాడుతూ.. ఈ సంకలనంలో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు కవితలు రాశారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్

- నేటి నుంచి 25 వరకు అవకాశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం నుంచి ఈనెల 25 వరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించనున్నారు. ఎన్నికల అధికారులు వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. బీఎల్‌ఓల ద్వారా దరఖాస్తు చేసుకున్న 484 మంది వృద్ధులు, 241 మంది దివ్యాంగులకు ఈ అవకాశం కల్పించారు. ఇందులో పినపాక నియోజకవర్గంలో 54 మంది వృద్ధులు, 54 మంది దివ్యాంగులు, ఇల్లెందులో 108 మంది వృద్ధులు, 35 మంది దివ్యాంగులు, అశ్వారావుపేటలో 126 మంది వృద్ధులు, 48 మంది దివ్యాంగులు, భద్రాచలంలో 86 మంది వృద్ధులు, 52 మంది దివ్యాంగులు, కొత్తగూడెం నియోజకవర్గంలో 110 మంది వృద్ధులు, 52 మంది దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీఎస్పీ




అమ్మగారిపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

అశ్వాపురం: మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన పాములపల్లి, కుమ్మరిగూడెం, అమ్మగారిపల్లి పోలింగ్ కేంద్రాలను మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి పోలీసులకు, స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సైలు సురేష్‌కుమార్, తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గులాబీలో గుబులు !

భద్రాద్రిలో అవకాశాలు అందిపుచ్చుకోలేని వైనం

- మొక్కుబడిగా అగ్రనేతల పర్యటనలు
- ప్రణాళికలో విఫలమవుతున్న పార్టీ నేతలు
- అభ్యర్థితో పాటు ఇన్‌చార్జ్‌పైనా వెల్లువెత్తుతున్న అసంతృప్తి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలాన్ని గులాబీ వనంగా మార్చాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే ఆ గమ్యాన్ని చేరుకునే ప్రయత్నంలో స్థానిక పార్టీ నేతలు, ఎన్నికల ఇన్‌చార్జ్‌లు తడబాటుకు గురవుతున్నారు. ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలే ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

విజయం దరిచేరలే..

తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో మొదట సీపీఎం, ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఇక్కడ విజయం సాధించారు. బీఆర్‌ఎస్‌కు రెండుసార్లూ ప్రతికూల ఫలితాలే వచ్చాయి. గత ఎన్నికల్లో ఓడిపోయిన తెల్లం వెంకట్రావు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. వృత్తిపరంగా వైద్యుడైన ఆయన పార్టీ కార్యక్రమాలపై అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తూ వచ్చారు. దీంతో ఇన్‌చార్జ్ బాధ్యతలను మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణకు అప్పగించారు. కొంతకాలం ఆయన హవా కొనసాగింది. ఈ క్రమంలో వెంకట్రావు పొంగులేటి వర్గంలో కొనసాగుతూ పార్టీని వీడారు. తెల్లం మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత.. అప్పటివరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న బాలసానిని తప్పించి, ఆ బాధ్యతలను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌కు అప్పగించారు.

ఇన్‌చార్జ్ మారినా అంతంతే..

భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంతో బాలసాని బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. 30 ఏళ్లకు పైగా నియోజకవర్గంపై ప్రభావం చూపిన బాలసాని పార్టీ మారడం గులాబీ దళానికి ఎదురుదెబ్బలా మారింది. ఈ గాయాన్ని మాన్పేందుకు మరింత పకడ్బందీగా పని చేయాల్సిన బీఆర్‌ఎస్ శ్రేణులు మళ్లీ పాత కథనే పునరావృతం చేస్తున్నాయి. ప్రచారానికి సంబంధించి ప్రతీ అంశంలో తెల్లం వెంకట్రావు.. ఇన్‌చార్జ్ తాతా మధుపై ఆధారపడడం, నిర్ణయాలు తీసుకోవడంలో మితిమీరిన జాప్యం ఆ పార్టీ శ్రేణులకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా నియోజకవర్గంపై పెద్దగా పట్టులేని తాతా మధు వ్యవహార శైలిని పార్టీ నాయకులు, కార్యకర్తలే జీర్ణించుకోలేకపోతున్నారు. ఏజెన్సీలో ఉండే ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ రూపొందించాల్సింది పోయి ఖమ్మం తరహా రాజకీయాలకు తెరలేపడం స్థానిక నేతలకు మింగుడుపడటం లేదు. దీంతో పార్టీలో ఉన్న అసౌకర్యాన్ని బయటకు చెప్పలేక, దాచుకోలేక సతమతం అవుతున్నారు.

అస్తవ్యస్త ప్లానింగ్..

ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందే పార్టీ పరంగా ఊపు తెచ్చేందుకు మంత్రి కేటీఆర్ భద్రాచలం పర్యటనకు ప్రణాళిక రూపొందించారు. భద్రాచలంలో గోదావరి నదిపై కరకట్ట పొడగింపు పనులకు శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. కానీ చివరి నిమిషంలో వాతావరణం అనుకూలించక ఈ కార్యక్రమం రద్దయింది. తిరిగి కేటీఆర్‌ను రప్పించడంలో స్థానిక నాయకత్వం విఫలమైంది. దీంతో ఎన్నికలకు ముందు పార్టీ పరంగా రావాల్సిన ఊపును చేజార్చుకున్నట్టయింది.

కేసీఆర్ సభకూ చేతులెత్తేశారు..

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటివరకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కాళ్లకు చక్రాలు కట్టుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఈ సమయంలో భద్రాచలంలో సీఎం పర్యటన ఏర్పాటు చేయించే విషయంలోనూ అభ్యర్థి తెల్లం వెంకట్రావు, ఇన్‌చార్జ్ తాతా మధు మరోసారి చేతులెత్తేశారు. పినపాక సభతో కలిసి భద్రాచలం బహిరంగ సభ నిర్వహించగా, అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు కనీసం మాట్లాడే అవకాశం కూడా దక్కలేదు.

పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి..

ఒకసారి మంత్రి కేటీఆర్ పర్యటన రద్దవడం, సీఎం కేసీఆర్ ప్రచార సభ పక్క నియోజవకర్గంతో పంచుకోవడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా గులాబీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. దీంతో మంత్రి కేటీఆర్‌తో రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహణకు జిల్లాలోని మిగిలిన అభ్యర్థుల కంటే ముందే భద్రాచలం నేతలు ప్లాన్ చేశారు. కానీ అనుకున్న ఫలితం సాధించలేకపోయారు. ముందుగా ప్లానింగ్‌లో లేని కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేటతో పాటు భద్రాచలాన్ని కలుపుకుని కేటీఆర్ రోడ్ షో ఖరారైంది. అదే రోజు హైదరాబాద్‌లో మరో కార్యక్రమంలోనూ కేటీఆర్ పాల్గొనాల్సి వచ్చింది. దీంతో నిర్ణీత షెడ్యూల్ కంటే ఆలస్యంగా భద్రాచలం వచ్చిన కేటీఆర్ రామయ్య దర్శనం చేసుకోలేకపోయారు. ఈ అంశంలో స్థానిక ప్రజల సెంటిమెంట్‌ను అర్థం చేసుకున్న మంత్రి.. 'నా పేరు తారక రామారావు, రాముడంటే మా కుటుంబానికి ఎంతో భక్తి ఉంది' అని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇలా వరుసగా జరుగుతున్న ఘటనలు ఎన్నికల సమయంలో ఆ పార్టీకి ఇబ్బందిగా మారింది. ఏజెన్సీలో ఉన్న పార్టీ కేడర్‌పై పెత్తనం చెలాయించడం తప్పితే పార్టీ పెద్దలతో మాట్లాడి ఎన్నికల ప్రచారాన్ని పకడ్బందీగా నిర్వహించడంలో విఫలమవుతున్నారని ఇన్‌చార్జ్ తాతా మధుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జంగ్ తెలంగాణ

ఆఖరి మోఖా



మధిర సభాప్రాంగణంలో వేసిన షామియానాలు

- నేడు ఖమ్మం జిల్లాకు కేసీఆర్
- మధిర, వైరాలో సీఎం ప్రజా ఆశీర్వాద సభలు
- ఏర్పాట్లు పూర్తి.. జన సమీకరణపై పార్టీ శ్రేణుల దృష్టి
- ఉమ్మడి జిల్లాలో ముగియనున్న సీఎం సభలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొననున్నారు. మధిర పట్టణంలోని ఆత్కూరు సమీపాన మధ్యాహ్నం ఒంటిగంటకు, వైరాలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో మధ్యాహ్నం 2గంటలకు జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం ప్రసంగిస్తారు. ఇప్పటి వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు కలిపి ఏడు సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. మంగళవారం జరిగే రెండు సభలతో ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ ఎన్నికల ప్రచారం ముగియనుంది.

ఏర్పాట్లు పూర్తి..

మధిర, వైరా సభలకు సంబంధించి పార్టీ నేతలు ఏర్పాట్లు పూర్తిచేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు లింగాల కమల్‌రాజ్, బానోత్ మదన్‌లాల్ మధిర, వైరాల్లో సభల ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు. మధిర సమీపాన ఆత్కూరు వద్ద 20 ఎకరాల మైదానం, వైరాలోని అయ్యప్ప దేవాలయం సమీపంలో 15 ఎకరాల విస్తీర్ణంలో సభల నిర్వహణకు సిద్ధం చేశారు. ఈ సభలను పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోగా, సోమవారం సాయంత్రానికి వేదికలు, ఇతరత్రా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎండ వేడితో ప్రజలు ఇబ్బంది పడకుండా షామియానాలు వేశారు. సభా ప్రాంగణం, రహదారికి ఇరువైపులా ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు అభ్యర్థుల హోర్డింగ్‌లు, కటౌట్లు ఏర్పాటు చేశారు. కాగా, సభలకు హాజరయ్యే వారికి తాగునీరు తదితర సౌకర్యాలు సమకూరుస్తున్నారు. కాగా, మధిర, వైరాలో సభా ఏర్పాట్లను ఎంపీ నామా నాగేశ్వరరావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎమ్మెల్యే రాములునాయక్, ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పరిశీలించారు.

భారీగా జన సమీకరణ

ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే సభలు కావడంతో ఇటు మధిరలో, అటు వైరాలో భారీగా జన సమీకరణ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. రెండు నియోజకవర్గాల వ్యాప్తంగా జనాన్ని తరలించేలా వాహనాలు సమకూరుస్తున్నారు. సభా ప్రాంగణానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సభా ప్రాంగణాలను పోలీసు అధికారులు పరిశీలించారు. కాగా, సభలు జరిగే సమయాన ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయనున్నారు.

బీఆర్‌ఎస్.. పరిపూర్ణం

మధిర, వైరాల్లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారం ముగియనుంది. అక్టోబర్ 27న పాలేరు నియోజకవర్గంలో జరిగిన మొదటి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం పాల్గొన్నారు. ఆ తర్వాత సత్తుపల్లి, ఇల్లెందు, ఖమ్మం, కొత్తగూడెం, అశ్వారావుపేట, పినపాకలో ఈ సభలు జరిగాయి. పినపాక నియోజకవర్గంలో పినపాకతోపాటు భద్రాచలం నియోజకవర్గాలకు కలిపి సభ నిర్వహించారు. దీంతో ఎనిమిది నియోజకవర్గాల సభలు పూర్తికాగా, మంగళవారంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రచారం ముగుస్తుంది. మరోవైపు ఐటీ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కూడా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొనగా.. ఈనెల 24న ఆయన ఖమ్మం రానున్నారు. ప్రచారం ముగిసే చివరి రోజు వరకు ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ నేతల ప్రచారాలు జరిగేలా కార్యాచరణ రూపొందించారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



మాట్లాడుతున్న ప్రియాంక ఆల, పక్కన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ సేవల కోసం మార్కెటింగ్ అధికారిని నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి 2,586 మంది, ఇతర జిల్లాల నుంచి ఇక్కడ ఓటుహక్కు వినియోగానికి 4,985 మంది ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. జిల్లా నుంచి 36 నియోజకవర్గాలకు పోస్టల్ బ్యాలెట్ పంపాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి మినహాయింపు లేదని, గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. 228 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గత ఎన్నికల్లో పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో పోలింగ్ తక్కువగా నమోదైందని, ఈసారి ఓటింగ్ శాతం పెంచేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఐఈఓ సులోచనారాణి, డీఈఓ వెంకటేశ్వరాచారి, మార్కెటింగ్ అధికారి అలీం, సివిల్ సప్లైస్ డీఎం త్రినాథ్, డీఎస్‌ఓ రుక్మిణి, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, క్రీడల అధికారి పరంధామరెడ్డి, డీపీఓ అభిమన్యుడు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పరిశీలన

సప్లిమెంటరీ ఈవీఎం ర్యాండమైజేషన్‌ను గోదాంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల సోమవారం పరిశీలించారు. జిల్లాకు మొదటి విడత కేటాయించిన ఈవీఎంలకు అదనంగా 160 బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల సంఘం కేటాయించిదని చెప్పారు. అనంతరం సీసీ కెమెరాలు తనఖీ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, నవీన్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు రజాక్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి సందడి షురూ..

- వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్
- ముగిసిన టెండర్ పనుల ప్రక్రియ
- డిసెంబర్ 13 నుంచి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, ఈఓ రమాదేవి తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకల సందడి ప్రారంభమైంది. ఈ ఆలయం ఆధ్వర్యంలో జరిగే అతి పెద్ద పండుగల్లో ముక్కోటి ఉత్సవం ఒకటి. ఈ ఏడాది డిసెంబర్ 13 నుంచి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు మొదలు కానున్నాయి. 2024 జనవరి 2 వరకు అధ్యయనోత్సవాలు, జనవరి 3 నుంచి 5 వరకు విలాసోత్సవాలు నిర్వహిస్తారు. 8వ తేదీన సర్వదేవతా అలంకారమైన విశ్వరూప సేవను అత్యంత వైభవోపేతంగా జరపనున్నారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 13 నుంచి 22 వరకు పగల్ పత్తు, 23 నుంచి జనవరి 2 వరకు రాపత్తు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పగల్ పత్తులో ప్రత్యేక అలంకరణలు..

పగల్ పత్తు ఉత్సవాల్లో శ్రీ సీతారామచంద్రస్వామి వారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారిని ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

పూర్తయిన టెండర్ల ప్రక్రియ

వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల గురించి ఊరూరా ప్రచారం చేసేందుకు వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ప్రియాంక ఆల సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు, పండితులు కలెక్టర్‌కు వేదాశీర్వచనం చేయగా, ఈఓ రమాదేవి సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన ప్రక్రియను ఈఓ కలెక్టర్‌కు వివరించారు. ముక్కోటి ఉత్సవాల పనులకు సంబంధించిన టెండర్ పనుల ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. భద్రాచలం, పర్ణశాల ఆలయాల్లో రూ.77 లక్షల విలువైన పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇందులో హంసాకృతి అలంకరణ, తాత్కాలిక షెడ్‌లు, స్వాగత ద్వారాలు, లైటింగ్ తదితర పనులు ఉన్నాయి. ఇవి పూర్తయ్యాక అధికారులు గోదావరిలో తెప్పోత్సవం ట్రయల్ రన్ నిర్వహిస్తారు.

కొత్త ప్రభుత్వ హయాంలోనే..

ఈనెల 30న జరిగే ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 3న వెలువడుతాయి. అనంతరం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుండగా, ఆ సర్కారు హయాంలోనే ముక్కోటి ఏకాదశి వేడుకలు జరుగుతాయి. తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి నూతన ఎమ్మెల్యేలు, మంత్రుల తాకిడి అధికంగా ఉండనుంది. ఈ మేరకు సెక్టార్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు రావొద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ముక్కోటి వేడుకల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. లాడ్జీలు, హోటళ్ల యజమానులతో చర్చించి గదుల ధరలు నిర్ణయించాలని డీఎస్‌ఓకు సూచించారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. భద్రాచలం, పర్ణశాల ఆలయాలను, వంతెన, కరకట్టను విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తెప్పోత్సవం సందర్భంగా హంస వాహనంలోకి పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతించాలన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేయాలని చెప్పారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. భక్తులకు బస్సులు, రైల్వే సమయాలను, జిల్లాలోని దర్శనీయ స్థలాలను తెలియజేసేలా సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని డీపీఆర్వోకు సూచించారు. వైద్య చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని, భద్రాచలం ఆస్పత్రిలో అత్యవసర వార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 22, 23 తేదీల్లో మద్యం, మాంసాహార విక్రయాలు నిలిపివేయాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఆలయ ఈఓ రమాదేవి, డీపీఓ రమాకాంత్, డీసీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈలు భీమ్లా, వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ శిరీష పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం



శివలింగాకారంలో ఏర్పాటు చేసిన దీపాలు

మండలంలోని వినాయకపురం చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు వేద పండితులు శివకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి భారీగా చేరుకున్న భక్తులు శివలింగాకారంలో ఏర్పాటు చేసిన దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ.. కోటి దీపాలను వెలగించి, పూజలు చేయడంతో పరమేశ్వరుని ఆశీస్సులు దక్కుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ బిర్రం రమాదేవి, ఈఓ, అర్చకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. – అశ్వారావుపేటరూరల్

25న ఖమ్మానికి ప్రియాంక గాంధీ



పాలేరు, ఖమ్మం, వైరా, మధిరల్లో రోడ్‌షో

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ నేత ప్రియాంకగాంధీ ఈనెల 25న ఖమ్మం జిల్లాకు రానున్నారు. ఎన్నికల ప్రచారానికి వస్తున్న ఆమె పర్యటన షెడ్యూల్ ఖరారైంది. పాలేరు, ఖమ్మం, మధిర, వైరా నియోజకవర్గాల్లో జరిగే రోడ్‌షోల్లో ప్రియాంక పాల్గొంటారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టి విక్రమార్క, రాందాస్‌నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ఆమె విస్తృతంగా ప్రచారం చేస్తారు. ఆయా రోడ్ షోలను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యాచరణ ప్రారంభించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈనెల 17న పినపాక నియోజకవర్గం మణుగూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారానికి సమయం తక్కువగా ఉండడంతో నాలుగు నియోజకవర్గాల్లో రోడ్ షోలకు ప్రియాంకగాంధీ వస్తున్నారు.

ఖమ్మం కలెక్టర్ వాహనం తనిఖీ


కలెక్టర్ వాహనంలో తనిఖీ చేస్తున్న అధికారి

కొణిజర్ల: ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ దివ్యాంగుల ఓటింగ్‌ను పర్యవేక్షించేందుకు సోమవారం ఖమ్మం నుంచి వైరా వెళ్లారు. తిరిగి వస్తుండగా కొణిజర్ల మండలం ప్రొద్దుటూరు క్రాస్ వద్ద చెక్‌పోస్టులో అధికారులు కలెక్టర్ వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు సహా ఏ ఒక్క వాహనాన్ని కూడా వదలకుండా తనిఖీ చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

ఎమ్మెల్యే కందాల వాహనం తనిఖీ


ఎమ్మెల్యే వాహనంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

నేలకొండపల్లి: పాలేరు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి వాహనం, ప్రచార రథాన్ని అధికారులు తనిఖీ చేశారు. మండలంలోని జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద విస్తృతంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం కట్టుకాసారంలో ప్రచారానికి ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి వెళ్తున్నందున కాన్వాయ్‌లోని వాహనాలను ఆపి నిశితంగా పరిశీలించారు.

కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో కాంగ్రెస్ నాయకులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం భద్రాచలంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అంతకుముందు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అదే సమయంలో భద్రాచలం కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ జెండాలు చేబూని ఆ ర్యాలీలో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతోపాటు హేళనగా మాట్లాడారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.


ఓట్ అక్షరాల ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

● తేదీ.. మరిచిపోకండి

పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఓటర్లలో చైతన్యం కలిగించేలా అధికారుల ఆధ్వర్యాన పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఖమ్మం కలెక్టర్ ఆదేశాలతో విద్యార్థులు పోలింగ్ జరగనున్న నవంబర్ 30వ తేదీని గుర్తు చేస్తూ ప్రదర్శన ఇచ్చారు.

– ఖమ్మం సహకారనగర్


పోలింగ్ తేదీని గుర్తు చేస్తూ...

ఓటు పడిందా.. లేదా?!

వీవీ ప్యాట్ ద్వారా తెలుసుకునే అవకాశం

- అపోహలు తొలగించేలా ప్రవేశపెట్టిన ఎన్నికల సంఘం
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం


ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: తొలినాళ్లలో ఓటింగ్‌కు బ్యాలెట్ పేపర్లు ఉపయోగించేవారు. ఈ విధానంలో వ్యయప్రయాసాలు పెరగడమే కాక ఓట్ల లెక్కింపునకు రోజుల తరబడి సమయం పట్టేది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈవీఎం యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే, వీటిపై అనేక అపోహలు ఉండేవి. ఎవరికి ఓటు వేశాం, అసలు ఓటు పడిందా లేదా అనే సందేహాలు వెంటాడేది. ఈనేపథ్యాన ఎన్నికల సంఘం వీవీ ప్యాట్ల(ఓటరు వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)ను తీసుకొచ్చింది. దీంతో కొన్ని సెకండ్ల పాటు కనిపించే డిస్‌ప్లే ద్వారా మనం ఎవరికి ఓటు వేశామో తెలుసుకోవడం సులభమైంది.

ఇలా చూసుకోవచ్చు..

పోలింగ్ స్టేషన్‌లో వీవీ ప్యాట్లను ఈవీఎంలకు అనుసంధానిస్తారు. ఈవీఎం యంత్రంపై ఓటరుకు నచ్చిన గుర్తు బటన్ పక్కన నొక్కిన వెంటనే ఆ గుర్తు పక్కనే ఉండే వీవీ ప్యాట్‌లో కన్పిస్తుంది. ఏడు సెకండ్ల పాటు ఆ గుర్తు కన్పించి వీవీ ప్యాట్‌కు అమర్చిన డబ్బాలో స్లిప్ పడిపోతుంది. ఆ స్లిప్‌పై ఓటరు సంఖ్యతో పాటు గుర్తు కూడా నమోదవుతుంది. ఓట్ల లెక్కింపు సమయాన సాంకేతిక సమస్యలతో ఈవీఎంలు మొరాయించినా, పోలైన ఓట్లపై అనుమానాలు వ్యక్తమైనా వీవీ ప్యాట్ల స్లిప్‌లను డబ్బా నుంచి తీసి లెక్కించి సందేహాలు నివృత్తి చేస్తారు.

విస్తృత ప్రచారం

ఓటు వేసే విధానం, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై అధికార యంత్రాంగం విస్తృత అవగాహన కల్పిస్తోంది. ఖమ్మం జిల్లాలో కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యాన ప్రతీ నియోజకవర్గంలో ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. డమ్మీ ఈవీఎంలు, వీవీ ప్యాట్ల ద్వారా అటు ఉద్యోగులు, ఇటు ఓటర్లకు వివరిస్తూ సందేహాలు నివృత్తి చేస్తున్నారు.

బూత్‌లోకి పోలీసులకు నో ఎంట్రీ...

వైరా: ఎన్నికల విధుల్లో పబ్లిక్ సర్వెంట్ అనే పదానికి సాధారణ అర్థం పోలీసు అధికారి అని కాదని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. యూనిఫాంలో ఉన్నా, లేకపోయిన పోలీసులకు పోలింగ్ బూత్‌లోకి వెళ్లడానికి అనుమతి ఉండదు. అవసరమైన పక్షంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎన్నికల అధికారి పిలిస్తే తప్ప బూత్‌లోకి వెళ్లడం నిషేధం.

- పోటీ చేసే అభ్యర్థికి జెడ్ ప్లస్ కేటగిరీ రక్షణ ఉన్నప్పటికీ రక్షణ సిబ్బందికి పోలింగ్ బూత్‌లోకి అనుమతి లేదు. అభ్యర్థితో పాటు మఫ్టీలో ఉన్న ఒక భద్రతా సిబ్బందిని మాత్రమే అనుమతిస్తారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కేబినెట్, స్టేట్ మంత్రులు, ఉపమంత్రులకు ప్రజల ఖర్చుతో భద్రత ఉంటుంది. అందువల్ల వీరి వెంట వచ్చే భద్రత సిబ్బందిని కూడా కేంద్రాల్లోకి అనుమతించరు. భద్రతా సిబ్బంది తలుపు బయట ఆగిపోవాలి. అక్కడ ఎవరికీ ఇబ్బంది కలిగించే పనిని మంత్రి వెంట ఉన్న సిబ్బంది చేయొద్దు.
- పోలింగ్ సిబ్బంది తమపై ఎన్నికల అధికారులు ఆదేశాలకు మాత్రమే అనుసరించాలి. రాజకీయ నాయకులు, మంత్రుల మాటలను పట్టించుకోవద్దు. ఎన్నికల కమిషన్ ఆజ్ఞాపత్రం ఉంటే తప్ప పోలింగ్ బూత్‌లోకి రావడానికి వీలులేదు. అక్కడ ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించరాదు. మాటలు, సైగలు చేసినా నేరం కిందకే వస్తుంది.

ఓటును బహిరంగపరిస్తే రద్దే...

నేలకొండపల్లి: పోలింగ్ సమయాన ఓటు వేయటానికి వచ్చిన వారు ఓటు వేస్తూ సెల్ఫీ దిగటం లేక ఇతరులకు ఓటును చూపించినా రూల్ 49 ఎం(ఓటు రహస్యం) బహిర్గతం నియమం మేరకు ఎన్నికల అధికారులు వారిని బయటకు పంపిస్తారు. అంతేకాక వారి ఓటును 17–ఏలో నమోదు చేస్తారు. దీంతో ఆ ఓటు లెక్కింపునకు పరిగణనలోకి తీసుకోరు. ఇక రూల్ నంబర్ 49 ఎన్ ప్రకారం అంధులైన ఓటర్లు తమ ఓటు వేయటానికి 18ఏళ్లు దాటిన సహాయకుడిని వెంట తీసుకెళ్లవచ్చు. కానీ సదరు వ్యక్తి ఓటును బహిరంగపర్చనని నిబంధన 10 ద్వారా ధ్రువీకరించాల్సి ఉంటుంది.

జిల్లా పోర్టల్‌లోనూ ఎన్నికల అవగాహన


జిల్లా పోర్టల్‌లో ఎన్నికలపై అవగాహన దృశ్యం

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా యంత్రాంగం విస్తృత ప్రచారం చేస్తోంది. ఇప్పటికే వాల్ రైటింగ్‌లు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తూ ఓటు వేసే విధానంపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఇక ఖమ్మం జిల్లా పోర్టల్(వెబ్‌సైట్) ద్వారా కూడా ప్రచారం మొదలుపెట్టారు. ఈ సైట్‌లో ఉండే జిల్లా విశేషాలు, ప్రఖ్యాత ప్రాంతాల చిత్రాలకు తోడు ఓటరు సందేహాలకు ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబర్, సీ–విజిల్ ప్రాధాన్యత, ఓటు వేసే విధానం, ఓటరు కార్డుకు ఆధార్ అనుబంధం తదితర అంశాలపై అవగాహన కల్పించడం మొదలుపెట్టారు.

రూ.3 లక్షలు సీజ్

పెనుబల్లి: మండలంలోని ముత్తగూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు మీదుగా సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.3 లక్షలను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఏపీ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి కొత్తగూడెం వెళ్తున్న కందుల సాయి కారులో ఈ నగదు లభించగా సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బోనకల్‌లో...

బోనకల్: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద ద్విచక్ర వాహనం, కారులో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.1,55,090 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు. బోనకల్ నుంచి గోవిందాపురం వెళ్తున్న వ్యక్తి ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.79,290 నగదుతోపాటు కారులో వెళ్తున్న వారి వద్ద రూ.75,800 స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

గుండాలలో మావోయిస్టు పోస్టర్లు..

గుండాల: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మావోయిస్టు పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. పీఎల్‌జీఏ 23వ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండలంలో మావోయిస్టు పోస్టర్లు వెలిశాయి. ఇటీవల కాలంలో రెండుసార్లు మావోయిస్టు పోస్టర్లు వెలిసిన సంఘటనలు విదితమే. సోమవారం గుండాల–గలబ మధ్య ఇల్లెందు–నర్సంపేట ఏరియా కమిటీ మావోయిస్టు పేరిట ఈ పోస్టర్లు వెలిశాయి. విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి శత్రువు తలపెట్టిన కమాండో, డ్రోన్, హెలికాప్టర్, బాంబు దాడులను సాహసోపేతంగా తిప్పికొట్టి పార్టీని, ప్రజలను రక్షించుకుందామని పోస్టర్లలో పేర్కొన్నారు. గ్రామాల్లో ఇన్ఫార్మర్ వ్యవస్థను ధ్వంసం చేసి, గ్రామ స్థాయి కమిటీలను బలోపేతం చేసి ప్రజలను సంఘటితం చేద్దామని, పోలీసు క్యాంపులకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు, ప్రభుత్వం బూటకపు అభివృద్ధికి వ్యతిరేకంగా ప్రజలను విస్తృతంగా పోరాటాల్లోకి కదిలిద్దామని వివరించారు.

అటూ ఇటూ.. మళ్లీ అటే..!


కాంగ్రెస్‌లో చేరిన బొజ్జాయిగూడెం ప్రజాప్రతినిధులు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడేనికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ కాంగ్రెస్‌లో చేరి మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి వచ్చినా... తిరిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇటీవల కృష్ణ మాజీ మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, అదేరోజు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, నాయకులు సర్దిచెప్పి మెడలో గులాబీ కండువా కప్పారు. అయితే, అనుచరులు, గ్రామ పెద్దల సూచనతో సోమవారం కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకుని సమావేశమయ్యారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, బీఆర్‌ఎస్ నాయకులు బొజ్జాయిగూడెం వెళ్లి కృష్ణతో చర్చించినా ఆయన ససేమిరా అనడంతో వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత మెట్టెల కృష్ణ, సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ శిరోమణి తదితరులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయడంతో వారికి కాంగ్రెస్ నాయకుడు మువ్వా విజయ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి సైదులు, నాయకులు కిన్నెర నర్సయ్య, కౌన్సిలర్లు నవీన్, రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

24న ఆర్టీసీ కార్గోలో వస్తువుల వేలం

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ కార్గోలో డెలివరీకాని వస్తువులను గుర్తించి వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి కొత్తగూడెం కార్గోకు వచ్చిన పార్సిల్స్ డెలివరీ తీసుకెళ్లని వస్తువులను ఈ నెల 24న సాయంత్రం 3 గంటలకు డిపో ఆవరణంలో వేలం వేస్తామని పేర్కొన్నారు. ఇంతకుముందు వస్తువులు తీసుకువెళ్లని వారు ఎవరైనా ఉంటే సరైన ఆధారాలతో ఈ నెల 24లోపు సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


జోజి (ఫైల్)

కల్లూరు: కల్లూరు ఎన్‌ఎస్‌పీ రింగ్ సెంటర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కల్లూరు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి సీతారాములు తన ఆటోలో వాడపల్లి జోజి, కొత్తపల్లి కోడెత్రాచు, నానికాల రవి, దాసరి సీతారాములును తీసుకుని తిరువూరు వైపు నుంచి కల్లూరు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎన్‌ఎస్‌పీ రింగ్ సెంటర్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో వాడపల్లి జోజి (49) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, సీతారాములు, కోడెత్రాచుకు గాయాలుకాగా కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు జోజికి భార్య, కుమార్తె ఉన్నారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం – తొండలగోపవరం స్టేషన్ల మధ్య సోమవారం ఉదయం రైలు నుంచి జారిపడిన గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెందాడు. ప్రయాణికులు ఇచ్చిన సమాచారంతో జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి చేరుకుని పరిశీలించగా మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 99636 41484, 87126 58607 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,196

తల్లడిల్లిన తల్లి హృదయం

వాహనం కింద పడి మూడు కుక్క పిల్లలు మృతి

భద్రాచలంఅర్బన్: కుక్క పిల్లలు వాహనం కింద పడి మృతి చెందడంతో తల్లి కుక్క మాతృవేదనకు గురవుతోంది. ఈ దృశ్యం సోమవారం భద్రాచలం మార్కెట్ యార్డులో కనిపించింది. మార్కెట్ యార్డు ప్రాంతంలో తన చిన్న పిల్లలతో కలిసి ఓ కుక్క జీవిస్తోంది. సోమవారం మూడు పిల్లలు నిలిపిఉన్న ఓ వాహనం కింద నిద్రిస్తుండగా, డ్రైవర్ బండిని తీయడంతో టైర్ల కింద పడి అవి మృతి చెందాయి. మృత్యువాత పడిన పసి కూనలను చూసి తల్లి కుక్క తల్లడిల్లుతోంది. మార్కెట్ యార్డు అంతా అరుస్తూ తిరుగుతోంది. ఈ దృశ్యం అక్కడున్న వారిని ఆవేదనకు గురిచేసింది. కాగా వాహనం నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.



మృతిచెందిన కుక్క పిల్లలు, అరుస్తూ మార్కెట్ యార్డులో తిరుగుతున్న తల్లి

23న మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు

ఖమ్మంమామిళ్లగూడెం: మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, పొన్నం వెంకటేశ్వర్లు తెలిపారు. ఖమ్మం బుర్హాన్‌పురంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు.. మున్నూరుకాపుల సంక్షేమం, ఉన్నతికి చేయూతనిచ్చిన కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడమేకాక మంత్రి పువ్వాడ అజయ్ విజయాన్ని కాంక్షిస్తూ ఈ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హాజరై మాట్లాడనున్నందున మున్నూరుకాపు కులస్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, మడూరి ప్రసాద్‌తో పాటు జి.శ్రీనివాస్, హరిప్రసాద్, గుండ్లపల్లి శేషగిరిరావు, పగడాల నరేందర్, శెట్టి భాస్కరరావు, కుమ్మరికుంట్ల వెంకటనారాయణ, రాపర్తి రాజా, గోలెపు గణేశ్, నానబాల హరీశ్, కె.ఉప్పలయ్య, ఆకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి రెండేళ్ల జైలుశిక్ష

నవభారత్: మోసం చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2015, జూన్ 12న ముగ్గురు వ్యక్తులు కారులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి వచ్చారు. తాము ఇన్వెస్టిగేషన్ బ్యూరోకు చెందిన వారమని, హైదరాబాద్ నుంచి వచ్చామంటూ పాఠశాల రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేవని, ఈ తప్పుడు లెక్కలను బహిర్గతం చేస్తే ఉద్యోగం పోతుందని కేజీబీవీ ఉద్యోగులను బెదిరించారు. వారి నుంచి రూ. 10 వేలు తీసుకుని వెళ్లిపోయారు. కాగా అనంతరం మోసపోయామని గ్రహించిన అప్పటి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మారేడు పద్మజ జూలూరుపాడు పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన హక్తుర్ సక్రం, గుగులోత్ చంద్రు, సుజాతనగర్ మండలం సీతంపేట బంజరకు చెందిన బానోత్ ప్రశాంత్‌లు కలిసి మోసం చేసినట్లు విచారణలో తేలింది. అనంతరం పోలీసులు కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. ఆరుగురు సాక్షులను విచారించాక నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు రెండేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీఓ విశ్వశాంతి వాదించగా, సిబ్బంది ఎం.హరిగోపాల్, ఉపేందర్‌రావు సహకరించారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు..

నవభారత్: పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి, పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎం.శ్యామ్‌శ్రీ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ మండలం నాగారం గ్రామానికి చెందిన మైనర్ బాలికపై 2019, అక్టోబర్ 30న అదే గ్రామానికి చెందిన బోర్ల వెంకట్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. 12 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకట్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున రావి విజయకుమార్ వాదించగా, ఎం.హరిగోపాల్, ఎస్.వెంకటేష్ సహకరించారు.

చోరీ కేసు నమోదు

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెంలో జరిగిన చోరీ ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన బాల శేషుబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 18న బంధువుల శుభకార్యానికి సూర్యాపేట వెళ్లాడు. 19వ తేదీ తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి దుండగులు నగదు, బంగారం, వెండి అభరణాలు చోరీ చేశారు. రూ.78వేల సొత్తు చోరీకి గురైనట్లు బాధితుడి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఫారెస్ట్ సిబ్బందితో గిరిజనుల వాగ్వాదం


అటవీశాఖ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న గిరిజనులు

అశ్వాపురం: మండల పరిధిలోని కుర్వాపల్లి కొత్తూరు గ్రామంలో అటవీ శాఖ ప్లాంటేషన్ చుట్టూ ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది సోమవారం ట్రెంచ్ కొడుతుండగా స్థానికులు గిరిజనులు అడ్డుకున్నారు. దీంతో గిరిజనులకు, ఫారెస్ట్ సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పాత ప్లాంటేషన్‌కు ట్రెంచ్ కొడుతున్నామని కొత్తగా ప్లాంటేషన్ వేయడం లేదంటూ ఎఫ్ఆర్ఓ రమేష్ నచ్చజెప్పడంతో గిరిజనులు వెనుదిరిగారు.

కలప స్వాధీనం


అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న కలప, ఆటో

దుమ్ముగూడెం : మండల పరిధిలోని చినబండిరేవు గ్రామంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న కలపను అటవీశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అధికారులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఆటోలో బరకాలు కప్పి తరలిస్తున్న 8 టేకు దిమ్మెలను బండిరేవు గ్రామంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు రేంజర్ కనకమ్మ తెలిపారు. కలప విలువ రూ.13,143గా ఉంటుందని పేర్కొన్నారు.

బీట్ అధికారిపై ఫిర్యాదు

దుమ్ముగూడెం : అటవీశాఖ బీట్ ఆఫీసర్‌పై అదే శాఖలో పనిచేస్తున్న హెల్పర్ సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పర్ణశాల సెక్షన్ బీట్ అధికారి శ్రీనివాసరావు వద్ద నరసింహారావు అనే వ్యక్తి హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకోగా, శ్రీనివాసరావు అకారణంగా తనపై దాడి చేసి కొట్టాడని నరసింహారావు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రశాంతినగర్‌కు చెందిన 81 ఏళ్ల బన్నీలాల్ అదృశ్యమైన ఘటనపై సోమవారం ఫిర్యాదు అందిందని ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. కొన్నాళ్ల కిందట మతిస్థిమితం కోల్పోయిన ఆయన ఈ నెల 14న మధ్యాహ్న భోజనం తర్వాత ఇంటి బయట కూర్చున్నాడు. అనంతరం వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరుకు తోట దగ్ధం

నేలకొండపల్లి: మండలంలోని ఆచార్లగూడెంలో మంటలు అంటుకుని చెరుకు తోట కాలిపోయింది. ఆచార్లగూడెంలో తిగుళ్ల భాస్కర్ ఎకరన్నర కౌలుకు తీసుకుని చెరుకు సాగు చేశాడు. ఈ తోట సోమవారం మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోవడంతో రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ఘటన జరిగిందా, ఎవరైనా నిప్పంటించారా అనేది తెలియరాలేదు.

న్యూస్‌రీల్

స్వస్థలానికి చేరిన యువకుడి మృతదేహం

అమెరికాలో 7న మృతి చెందిన వరుణ్



వరుణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

ఖమ్మంక్రైం: అమెరికాలోని చికాగోకు చదువు నిమిత్తం వెళ్లిన ఖమ్మానికి చెందిన యువకుడు పుచ్చ వరుణ్‌రాజ్ (25)పై దుండగుడు గత నెల 29వ తేదీన కత్తితో దాడి చేయగా చికిత్స పొందుతూ ఈనెల 7న మృతి చెందిన విషయం విదితమే. అక్కడ న్యాయపరమైన ప్రక్రియలు పూర్తయ్యాక స్నేహితులు వరుణ్ మృతదేహాన్ని పంపించగా సోమవారం ఖమ్మం చేరుకుంది. మామిళ్లగూడెంలోని నివాస గృహానికి మృతదేహాన్ని తీసుకురాగా తల్లిదండ్రులు రామ్మూర్తి, అరుణ, సోదరి శ్వేత కన్నీరుమున్నీరుగా విలపించారు. ఉన్నత చదువులు పూర్తిచేసి జీవితంలో స్థిరపడతాడనుకున్న కుమారుడు విగతజీవిగా రావడంతో రోదిస్తున్న తల్లిదండ్రులను ఆపడం ఎవరితరం కాలేదు. అనంతరం వరుణ్ అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, వరుణ్ మృతదేహం వద్ద మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగేంధర్ కూడా నివాళులర్పించారు.

ఇద్దరిని చితకబాదిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను మావోయిస్టులు కిడ్నాప్ చేసి చితకబాది వదిలివేసినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో బేస్‌క్యాంపులకు కావాల్సిన కోళ్లను ఆటోల ద్వారా సదరు వ్యక్తులు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమాన సోమవారం పూటుకుపల్లి –దుబ్బామర్క అటవీ ప్రాంతంలో మావోయిస్టులు వీరిని అడ్డగించి ఇన్‌ఫార్మర్లుగా పనిచేస్తున్నారని చెబుతూ చితకబాది వదిలివేసినట్టు తెలిసింది. ప్రస్తుతం వారిద్దరు కిష్టారం పోలీస్ స్టేషన్‌లో చికిత్స పొందుతున్నట్టు సమాచారం.

అలరించిన సంగీత విభావరి



పాట పాడుతున్న గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో సోమవారం రాత్రి 'నా పాట పంచామృతం' పేరిట స్వర సుధ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. స్వర సుధ మ్యూజిక్ అసోసియేషన్ ఏర్పాటు చేసి మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత అసోసియేషన్ ముఖ్య సలహాదారు డాక్టర్ వనం కృష్ణవేణి, గౌరవ అధ్యక్షుడు పారుపల్లి సురేశ్ మాట్లాడారు. అనంతరం ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం పాడిన మధుర గీతాలను గాయకులు వీవీ రెడ్డి, వింజమూరి రేవతి, సుధారాణి, ప్రియాంక, వి.మాలతినాయుడు, బుద్ధ శ్రీనివాస్ ఆలపించి అలరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొమరాజు మాధవరావుతోపాటు వినయ్‌కుమార్, ఊటుకూరి శ్రీనివాసరావు, కేవీ.రమణారావు, నగేశ్, పిన్నెల్లి యాదగిరి పాల్గొన్నారు.

ఈ దేశం అందరి సొంతం





సమ్మేళనానికి హాజరైన మైనార్టీలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఇమ్రాన్ ప్రతాప్ ఘర్హీ

- జోడోయాత్రతో రాహుల్ ప్రేమను పంచాడు
- కేసీఆర్, మోదీ ఇద్దరూ స్నేహితులే
- కాంగ్రెస్ మైనార్టీ సెల్ జాతీయ చైర్మన్, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌ఘర్హీ

ఖమ్మంమయూరిసెంటర్: భారతదేశం ఏ ఒక్కరి సొంతం కాదని.. ప్రజలందరిదీ అని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జాతీయ చైర్మన్, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌ఘర్హీ అన్నారు. ఖమ్మంలో సోమవారం జరిగిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కాదని, ప్రజల జీవితాలను మార్చేవని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు సెమీ ఫైనల్స్ వంటివైన ఈ ఎన్నికల్లో మైనార్టీలు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడోయాత్ర ద్వారా ప్రజలకు ప్రేమను పంచారని తెలిపారు. రాహుల్ యాత్ర జోష్‌లో తెలంగాణతో పాటు కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని చెప్పారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తానని విస్మరించిన సీఎం కేసీఆర్.. సంక్షేమ పథకాలను దూరం చేశారని ఆరోపించారు. పార్టీ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని, తద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఫలాలు అందుతాయని ఇమ్రాన్ తెలిపారు. కాగా, కేసీఆర్, మోదీ ఇద్దరి శైలి ఒకటేనని, ప్రజలపై భారం మోపడమే వారు బాధ్యతగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీకి అవసరమైన ప్రతీసారి బీఆర్‌ఎస్ అండగా నిలుస్తున్న విషయాన్ని అందరూ గుర్తించి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఎంపీ మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. వక్ఫ్ భూములను కాజేసి మైనార్టీలకు తీరని అన్యాయం చేసిన కేసీఆర్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇచ్చి మైనార్టీల పక్షపాతిగా నిలుస్తోందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, నాయకులు అమర్జహాబేగ్, మహ్మద్ జావేద్, ఫాతిమా జోహరా, రఫీదాబేగం, జాన్‌బీ, కమర్తపు మురళి, నాగుల్‌మీరా, ముస్తఫా, అశ్రిఫ్, చోటేబాబా, రఫీ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి మాట్లాడుతూ అవినీతితో తెలంగాణ భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ మేరకు ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించేలా పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో నాగండ్ల దీపక్‌చౌదరి, రామ్మూర్తినాయక్, నల్లమల వెంకటేశ్వరరావు, ఏర్నేని రామారావు, మానుకొండ రాధాకిశోర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాకు వచ్చిన మైనార్టీ సెల్ చైర్మన్, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ ఘర్హీను కాంగ్రెస్ నాయకుడు షేక్ జిలానీ మర్యాదపూర్వకంగా కలిశారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఖమ్మంరూరల్: పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మంలో తుమ్మల నాగేశ్వరరావును గెలిపించాలని మాజీ ఎంపీ మహ్మద్ అజారుద్దీన్ పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరిలో కాంగ్రెస్ నాయకుడు రామా శ్రీను స్వగృహంలో నాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల యుగేంధర్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

- ఎన్నికల వేళ పొరపాట్లకు తావివ్వొద్దు
- ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన నోడల్ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతీ ఎస్‌ఎస్‌టీ బృందానికి సీఆర్పీఎఫ్ సిబ్బందిని కేటాయించాలని సూచించారు. బ్యాంకు ఖాతాలతో పాటు యూపీఐ లావాదేవీలపై విచారణ చేయాలని, చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. ఇక పోలింగ్ రోజు సామగ్రిని తీసుకెళ్లే బస్సులకు జీపీఎస్ పరికరాలు బిగించాలని చెప్పారు. బ్యాలెట్ యూనిట్ల మొదటి దశ తనిఖీ తర్వాత 23, 24 తేదీల్లో కమీషనింగ్ చేపట్టాలని, పోలింగ్ సిబ్బంది శిక్షణ ఇచ్చే కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వంద శాతం పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు వంద శాతం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా పర్యవేక్షించాలని కలెక్టర్ గౌతమ్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వీసీ ద్వారా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణఇచ్చే కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ నమోదు చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ విషయమై అభ్యర్థులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇక ఎన్నికల సంఘం నిబంధనల మేరకు హోం ఓటింగ్ పూర్తి చేయాలని తెలిపారు. ఆ తర్వాత నియోజకవర్గ స్థాయి మాస్టర్ శిక్షకులు, సెక్టోరల్ అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ యూనిట్ల కూర్పులో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకటి కంటే ఎక్కువ బ్యాలెట్ యూనిట్లు ఉపయోగించే నియోజకవర్గాల్లో పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించాలని తెలిపారు. అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, జిల్లా స్వీప్ నోడల్ అధికారి కె.శ్రీరామ్, నోడల్ అధికారులు సోమశేఖరశర్మ, విజయనిర్మల, వివిధ శాఖల అధికారులు సుమ, శ్రీలత, విజయకుమారి, విజయనిర్మల, కిషన్‌రావు, సోమశేఖరశర్మ, అజయ్‌కుమార్, అరుణ పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి



సోమవరంలో ఓటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

వైరా: దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్దే ఓటు వేసేందుకు అవకాశం కల్పించగా.. ఓటింగ్ ప్రక్రియలో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. వైరాలోని 12వ వార్డు రేచర్లబజార్, 11వ వార్డు సోమవరంలో ఇంటి వద్ద ఓటింగ్ ప్రక్రియను సోమవారం ఆయన రిటర్నింగ్ అధికారి సత్యప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1,564 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరితో ఓట్లు నమోదు చేయించేందుకు 30 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కాగా, దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసే సమయాన రహస్య విధానం అవలంబించాలని, ఈ సమయాన అభ్యర్థుల ఏజెంట్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ కేవీ శ్రీనివాస్, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి కూడా కేసీఆరే సీఎం

- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు
- మధిర, వైరాలో సీఎం సభల ఏర్పాట్లు పరిశీలన



వైరాలో సభా వేదికను పరిశీలిస్తున్న ఎంపీ నాగేశ్వరరావు, తదితరులు

వైరా: తెలంగాణలోని అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలవడం, కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. వైరాలో మంగళవారం జరగనున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానుండగా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌తో కలిసి సోమవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడానికి సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారన్నారు. ఇందుకోసం రైతుబంధు, రైతు బీమా, పింఛన్లు, కల్యాణలక్ష్మి తదితర పథకాలను అమలుచేస్తూ దేశంలోనే ఆదర్శ సీఎంగా నిలిచారని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రజలను మోసం చేయడానికే తప్ప ఎవరికీ మేలు జరగదని చెప్పారు. కాగా, వైరాలో సభ మైదానం, ట్రాఫిక్ మళ్లింపు, బందోబస్తుపై ఏసీపీ ఎంఏ రహమాన్ అధికారులు పర్యవేక్షించారు. ఇక సీఎం వచ్చే హెలికాప్టర్ కోసం సభావేదిక సమీపాన హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు.

సభను విజయవంతం చేయాలి

మధిర: మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజ్ గెలుపును ఆకాంక్షిస్తూ మంగళవారం నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నందున పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సభావేదిక వద్ద ఏర్పాట్లను అభ్యర్థి కమల్‌రాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. డీసీసీబీ ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావుతో పాటు చింతనిప్పు కృష్ణచైతన్య, చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, మొండితోక జయాకర్, రావూరి శ్రీనివాసరావు, కనుమూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి కోత.. మాకు మేత..

పంట చేతికందడంతో రైతన్నలు వరి కోతలపై దృష్టి సారించారు. అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం సమీపాన ఓ రైతు పొలంలో యంత్రాల సాయంతో సోమవారం వరి కోయించడం మొదలుపెట్టాడు. ఇదే సమయాన వందల సంఖ్యలో కొంగలు ఆహార సేకరణ కోసం వచ్చిన దృశ్యమే ఇది..

–అశ్వారావుపేటరూరల్



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాల పంట



సాహితిని అభినందిస్తున్న కళాశాల బాధ్యులు



అవార్డు అందుకుంటున్న అనూష

ఖమ్మంస్పోర్ట్స్: తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మంలోని కవిత డిగ్రీ కళాశాల విద్యార్థిని వేముల సాహితీకి స్వర్ణ పతకం లభించింది. 72 కేజీల విభాగంలో ఆమె ప్రథమస్థానంలో నిలవగా కరస్పాండెంట్ ఉషాకిరణ్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాధాకృష్ణమూర్తి, పారుపల్లి రోజారాణి, పీడీ రాజేశ్ అభినందించారు.

ఉత్తమ వెయిట్ లిఫ్టర్‌గా అనూష

హైదరాబాద్‌లో జరిగిన సీనియర్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం.అనూష రెండు స్వర్ణ పతకాలు దక్కించుకుంది. ఇదే కళాశాలలో చదువుతున్న ఎస్.భార్గవ్‌నాయుడు జూనియర్ విభాగంలో రజత పతకం కైవసం చేసుకోగా, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, పీడీ జె.ఉపేందర్, కోచ్ డి.వినోద్‌కుమార్ అభినందించారు. అలాగే, ఖమ్మంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి జి.సూర్య స్వర్ణ, కాంస్య పతకాలు సాధించగా విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, అకడమిక్ డీన్ ఎన్‌ఆర్‌ఎస్‌డీ వర్మతోపాటు సీహెచ్ బ్రహ్మం, జి.ప్రకాష్‌రావు, గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ జోజిచాకో అభినందించారు.

కేరళ మాదిరి ప్రజా పరిపాలన కావాలి..



మాట్లాడుతున్న విజయరాఘవన్

భద్రాచలంఅర్బన్: విద్య, వైద్యం, సంక్షేమం విషయంలో ప్రజా పరిపాలన అందిస్తున్న కేరళ.. దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని, ఇలాంటి పాలన అంతటా రావాల్సిన అవసరముందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు విజయరాఘవన్, కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. భద్రాచలంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణలో పాలన నలుగురి చేతుల్లో ఉందని ఆరోపించారు. భద్రాచలానికి తీవ్ర అన్యాయం చేసిన బీఆర్‌ఎస్‌కు ఓటు అడిగే హక్కు లేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రాచలానికి ఎందుకు రావటం లేదో చెప్పాకే ఓట్లు అడగాలని సూచించారు. తాజాగా కేటీఆర్ రోడ్ షోలో భద్రాచలం ప్రాంత సమస్యలు ప్రస్తావించకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ముంపు ప్రాంతాలు, ఐదు పంచాయతీల విలీనం తదితర సమస్యలపై ప్రస్తావించలేదన్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గత ఐదేళ్లలో ఏం చేశారని మళ్లీ ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు ప్రజా పాలన కోసం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్యను గెలిపించాలని కోరారు. కాగా, భద్రాచలం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య తరఫున ప్రచారానికి ఈ నెల 25న త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, 27న బృందా కారత్ రానున్నారని వెల్లడించారు. సమావేశంలో నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేశ్, ఎంబీ నర్సారెడ్డి, ఎం.రేణుక, సున్నం గంగ, బి.వెంకటరెడ్డి, బండారు శరత్‌బాబు, పి.సంతోష్‌కుమార్, నాదెళ్ల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై పోరాడాలి

బోనకల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారినందున.. ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్ పిలుపునిచ్చారు. మధిర సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం రాత్రి బోనకల్ మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. నాయకులు సాయిబాబు, పొన్నం వెంకటేశ్వరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, దొండపాటి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ను నిలువరించాలి

ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కూసుమంచి: కార్పొరేట్ అనుకూల విధానాలు, ఫాసిస్ట్ భావజాలంతో మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీతో పాటు నిరంకుశ పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌ను ఈ ఎన్నికల్లో నిలువరించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. కూసుమంచిలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన నాటి టీఆర్‌ఎస్‌ను ప్రజలు రెండుసార్లు గెలిపిస్తే హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. అంతేకాక ప్రజలను నిర్బంధాలకు గురి చేసేలా పాలన సాగించిందని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి ఏ నాడు సమయం ఇవ్వలేదని తెలిపారు. దీనికి తోడు మేధావులపై కేసులు పెట్టించడం, నిర్బంధాలకు గురిచేయటం కేసీఆర్‌కు పరిపాటిగా మారిందని ఆరోపించారు. ఈ నేపథ్యాన బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలను నిలువరించేందుకు పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామని.. ప్రజలు కూడా తమకు మద్దతుగా నిలవాలని కోరారు. కాగా, ప్రజల్లో ఓటు వేశాక తమ పాత్ర ముగిసిందని భావించే ధోరణిని విడనాడి ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలుపెట్టాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలే గీటురాయి అయినందున మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని హరగోపాల్ కోరారు. సమావేశంలో టీపీజేఏసీ నేతలు డాక్టర్ మణిమాల, రవిచంద్ర, వేణుతో పాటు ఎన్‌డీ నాయకులు మాతంగి రామస్వామి, లక్ష్మయ్య, తాళ్లూరి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రారంభం



ఈవీఎంలను పరిశీలిస్తున్న అబ్జర్వర్ మహంతి, కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య ఖరారయ్యాక పోలింగ్ స్టేషన్ల సంఖ్య ఆధారంగా ఎన్నికల సంఘం అదనపు బ్యాలెట్ యూనిట్లను కేటాయించింది. ఈ యూనిట్లు ఇటీవల ఖమ్మం చేరుకోగా, సోమవారం మొదటి దశ తనిఖీ చేపట్టారు. జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో పార్టీల ప్రతినిధుల సమక్షాన చెకప్ మొదలుపెట్టగా.. ఎన్నికల పరిశీలకులు తుషార్ కాంత మహంతి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేరకు అదనంగా జిల్లాకు కేటాయించిన 894 బ్యాలెట్ యూనిట్ల తనిఖీ పూర్తయ్యాక.. ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయిస్తామని వెల్లడించారు. అలాగే, 23, 24వ తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో చేపట్టే ఈవీఎం, వీవీ ప్యాట్ల కమీషనింగ్‌కు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'గుర్తు'ంచుకోండి!



ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొంటూనే ఇంటింటి ప్రచారం విస్తృతంగా చేస్తున్నారు. ఇప్పటికే ఈవీఎంలపై పేర్ల వరుస ఖరారు కావడంతో ఆయన సోమవారం డమ్మీ ఈవీఎంల ద్వారా తన గుర్తు, ఫొటో ఎక్కడ ఉంటుందో ఓటర్లకు వివరిస్తూ.. కారు గుర్తుకు వేయాలని ప్రజలను అభ్యర్థించారు.

–ఖమ్మంమయూరిసెంటర్

నేనే బాగా నడుపుతా..



బీఆర్‌ఎస్ పాలేరు అభ్యర్థి, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి నేలకొండపల్లిలోని పలు మండలాల్లో విస్తృత ప్రచారం చేశారు. రోడ్డు షోలు, సమావేశాల్లో మాట్లాడటమే కాక ఓటర్లను కలిసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని కట్టుసాగరంలో రైతులను ఓటు అభ్యర్థించిన ఆయన కాసేపు పొలంలో ట్రాక్టర్ నడిపి ఆకట్టుకున్నారు.

–నేలకొండపల్లి

తల్లి ఆశీర్వాదం నాకే ఉంది..



ఇల్లెందు బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ ఇల్లెందు, గార్ల మండలాల్లో సోమవారం ప్రచారం చేయగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరడంతో కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇల్లెందు మండలం మండలం పూబెల్లి ప్రచారానికి వెళ్లిన హరిప్రియ అక్కడ గ్రామదేవతకు పూజలు చేశాక ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు.

–ఇల్లెందురూరల్